క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ రాఘవేంద్ర కాలనీ, మదర్‌డెయిరీ, లెక్చరర్స్‌కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు. 11కేవీ బీరప్ప టెంపుల్, వీ–గార్డ్, వాంబేకాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో నాయకులు

కందుకూరు: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆదివారం గాంధీ భవన్‌లో రిపబ్లిక్ డేను పురస్కరించుకొని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణ నాయక్, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ బోనాలు



అమ్మవారికి బోనాలు తీసుకొస్తున్న మహిళా భక్తులు

పహాడీషరీఫ్: మామిడిపల్లి గ్రామ శివారులోని ఈర్లగండి మైసమ్మ బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో డప్పు చప్పుళ్ల మధ్య బోనం ఊరేగింపుతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివశక్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించుకున్నారు.

ఉత్తమ అవార్డు అందజేత



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నరేందర్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన బిల్ కలెక్టర్ నరేందర్ మహేశ్వరం నియోజకవర్గంలో బెస్ట్ బీఎల్‌ఓ(బూత్ లెవల్ ఆఫీసర్)గా అవార్డు అందుకున్నాడు. 18 ఏళ్లు నిండిన యువతను కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేయడం, ఓటర్ల జాబితాలో సవరణలు తదితర అంశాలలో కచ్చితమైన విధి నిర్వహణను మెచ్చి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు. ఈ అవార్డు దక్కడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నాడు.

యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని దెబ్బడగూడలో వివేకానంద యువజన సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఆ సంఘం పెద్దలు ఎల్మటి దేవేందర్‌రెడ్డి, జిట్టా రాజేందర్‌రెడ్డి కమిటీని ప్రకటించారు. వివేకానంద యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా సామల దయాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సురసాని కిరణ్‌కుమార్‌రెడ్డి, కోశాధికారిగా కల్లెం సందీప్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా సామ దీక్షిత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడిగా సుధాకర్‌రెడ్డి, భూమిరెడ్డి, అమరవాది శ్రీనివాస్‌గుప్తా, కల్లెం చెన్నారెడ్డి, ఎల్మటి అశోక్‌రెడ్డి, ఎల్మటి ఇంద్రసేనారెడ్డి, సురసాని రవీందర్‌రెడ్డి, కల్లెం వినోద్‌రెడ్డి, కొలను శ్యాంసుందర్‌రెడ్డి, సలహాదారుడిగా కొంతం జంగారెడ్డి, అమరవాది మనోహర్‌గుప్తా, కల్లెం రవికాంత్‌రెడ్డి, జిట్టా రవీందర్‌రెడ్డి, కల్లెం సురేందర్‌రెడ్డి, కల్లెం కృష్ణారెడ్డి, కల్లెం సత్తిరెడ్డి, కొలను విష్ణేశ్వర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.



హుడాకాంప్లెక్స్: బీజేపీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి



మహేశ్వరం: సహకార సంఘం కార్యాలయంలో..



మహేశ్వరం: తుక్కుగూడ డీసీపీ కార్యాలయంలో..

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

మహేశ్వరం నియోజకవర్గంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు త్రివర్ణ పతాకాలను ఎగురవేసి, జాతీయ గీతం పాడుతూ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల సేవలను కొనియాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు.



మీర్‌పేట: టీకేఆర్ కళాశాలలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులు



మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో జెండా ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగరాజు



మహేశ్వరం: తహసీల్దార్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ సైదులు



కందుకూరు తహసీల్దార్ కార్యాలయంలో..



కందుకూరు: నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో బహుమతులతో విద్యార్థులు



తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయంలో..



తుక్కుగూడ: జెండా ఆవిష్కరణలో కమిషనర్ సరస్వతి, మేయర్ పారిజాత, కార్పొరేటర్లు



కందుకూరు: ఆర్డీఓ కార్యాలయం వద్ద చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆర్డీఓ



పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీలో చిన్నారులను అభినందిస్తున్న కౌన్సిలర్ లక్ష్మీనారాయణ

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



పెద్దమ్మ తండాలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దమ్మ తండాలో ప్రభుత్వ పథకాలు పొందిన లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు ఇందిరమ్మ హయాంలో దివంగత నేత డా. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి, నేడు రేవంత్‌రెడ్డి హయాంలోనే ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేసిందన్నారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్కరికి రేషన్‌కార్డు రాలేదని, ఇంటి స్థలం ఇవ్వలేదన్నారు. వారు చేయని సంక్షేమ కార్యక్రమాలను తాము చేస్తుంటే బీఆర్‌ఎస్ నేతల కళ్లు మండుతున్నాయన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. జాబితాలో తమ పేరు రాలేదని ఎవరూ ఆందోళన చెందకుండా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అంతకుముందు పెద్దమ్మ తండా గ్రామంలో పథకాలకు మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎర్రవాపు ఇజ్రాయేల్, వత్తుల రఘుపతి, నేనావత్ రాజునాయక్, ఆవుల యాదయ్య, నందిగామ నర్సింహ, అదిల్, రాజు, ఎర్ర చంద్ర మోహన్, నడికూడ శివ, బాల్‌రాజ్, లాజర్, రాజేందర్, సేవ్యా నాయక్, ప్రసాద్, రఘుపతి పలువురు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌లలో రూ.1కోటి 9 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆదివారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శంకుస్థాపనలు చేసిన పనులన్నింటినీ త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, మాజీ కార్పొరేటర్లు పెండ్యాల నర్సింహ, సిద్దాల లావణ్య, బొక్క రాజేందర్‌రెడ్డి, మేకల విజయలక్ష్మి, పెండ్యాల శివపార్వతి, బీఆర్‌ఎస్ నాయకులు అర్కల కామేశ్‌రెడ్డి, దిండు భూపేశ్‌గౌడ్, జటావత్ శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే, తదితరులు

అర్హులకు సంక్షేమ పథకాలు

మహేశ్వరం: అర్హులకు సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామని, రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దమ్మ తండాలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఈ పథకాల ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. రైతు భరోసా పథకం కింద రైతుకు ఎకరానికి రెండు పంటలకు రూ.12వేల పెట్టుబడి సాయం, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.6 లక్షలు, బీసీ, ఓసీలకు రూ.5 లక్షలు, భూమి లేనివారికి సంవత్సరానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రూ.12వేలు, రేషన్ కార్డులను అందిస్తుందన్నారు. అంతకు ముందు పెద్దమ్మ తండాలో రేషన్ కార్డులు 77, ఇందిరమ్మ ఇళ్లు 52, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 03, రైతు భరోసా 42 మందికి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ శైలజ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి నాగమణి, ఉద్యానవన అధికారి సుప్రియ, ఉపాధి హామీ అధికారి పరిమళ, డిప్యూటీ తహసీల్దార్ నవత, ఆర్ఐ పావని, పంచాయతీ కార్యదర్శి పరమేష్ పలువురు పాల్గొన్నారు.



పెద్దమ్మ తండాల్లో మంజూరు పత్రం అందజేస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

ఆధ్యాత్మిక చింతన, శాంతి పెంపునకు కృషి

అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ



జెండా ఆవిష్కరిస్తున్న సంస్థ చైర్మన్ మాధవన్‌జీ, గురువు సునీల్‌దాస్

మహేశ్వరం: అవేర్ భగవతీ పురంలో సత్యం, ప్రేమ, శాంతి, అహింస మార్గాల బోధనే లక్ష్యంగా విశ్వ శాంతి కేంద్రాన్ని ప్రారంభిస్తామని అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మొహబ్బత్‌నగర్ గ్రామ పరిధి శ్రీశైలం జాతీయ రహదారి పక్కన అవేర్ మాధవన్‌జీ కార్యాలయంలో ఆధ్యాత్మిక గురువులు, సంస్థ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం అవేర్ సంస్థలో ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక చింతన, శాంతి పెంపొందించేందుకు ప్రపంచ శాంతి కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, శాంతి సందేశం అందించాలన్నారు. అవేర్ సంస్థలో పేదలకు నాణ్యతతో కూడిన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. అంతకు ముందు జెండా పండుగ సందర్భంగా అవేర్ సంస్థలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వ శాంతి కేంద్రం జనరల్ సెక్రటరీ, ఆధ్యాత్మిక గురువు స్వామి సునీల్‌దాస్, అవేర్ సంస్థ డైరెక్టర్లు వరుణ్, తరుణ్, సంస్థ ప్రతినిధులు ఎండీ. హిర్షత్, డా.జాఫర్, సీతారామయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య స్క్రాప్ గోదాములు



అక్రమంగా కొనసాగుతున్న స్క్రాప్ డంపింగ్ యార్డ్

పొంచి ఉన్న ప్రమాదం

- భయం గుప్పిట్లో జనం
- కనీస జాగ్రత్తలు పాటించని నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో జనావాసాల మధ్య అక్రమంగా కొనసాగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల డంపింగ్ యార్డ్‌లతో ప్రమాదాలు సంభవించే అవకాశం లేకపోలేదు. ఒకవైపు వ్యర్థాల నుంచి వెలువడుతున్న దుర్వాసన, మరోవైపు వ్యాధులు ప్రబలుతుండడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనలో ఉన్నారు. ఇటీవల బిస్మిల్లా కాలనీ, శ్రీరాం కాలనీల్లో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదాలే ఈ కోవలోకి వస్తాయి. ఇలా తరచూ ఏదో ఒక చోట డంపింగ్ యార్డుల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతుండడం షరా మామూలైపోయింది. ముఖ్యంగా జల్‌పల్లి కమాన్ రోడ్డు, శ్రీరాం కాలనీల్లో వీటి సమస్య అధికంగా ఉంది. అనధికార చెత్త పాయింట్ల వద్ద ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను సేకరించి ఈ డంప్‌లో నిల్వ చేస్తున్నారు.

డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాలతో...

డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాలతో అనేక రకాల వస్తువులు ఉంటుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. చెత్తలో లభ్యమయ్యే ఇనుప వస్తువులు, పేలుడు స్వభావం కలిగిన వస్తువులను కూడా నిర్వాహకులు అవగాహన రాహిత్యంతో నిల్వ ఉంచుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రమాదాలు జరిగితే తమ పరిస్థితి ఏంటని బస్తీ వాసులు ఆందోళన చెందుతున్నారు. వేసవి వచ్చిందంటే తరచూ ఏదో ఒక డంపింగ్ యార్డ్‌ల్లో ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. రెండేళ్ల క్రితం జల్‌పల్లి కమాన్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో స్క్రాప్ గోడౌన్ పక్కనే డీసీఎంలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. రాయల్ కాలనీలో కూడా స్క్రాప్ గోడౌన్‌లో అంటుకున్న మంటలు రెండు మూడిళ్లకు వ్యాపించిన విషయం విదితమే.



బిస్మిల్లా కాలనీలోని డంపింగ్ యార్డ్‌లో అంటుకున్న మంటలు (ఫైల్)

పర్యవేక్షణ అంతంతే..

మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ గోడౌన్‌లు, చెత్త డంపింగ్‌లను వెంటనే తొలగించాలని యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారు. నిర్వాహకులు నాలుగైదు రోజులు తూతూ మంత్రంగా మూసి అనంతరం యథేచ్ఛగా తమ అక్రమ దందా కొనసాగిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకే వ్యాపారులు చెలరేగిపోతున్నారని స్థానికులు వాపోయారు.

వెంటనే మూసి వేయించాలి



జల్‌పల్లి మున్సిపాలిటీలో అక్రమంగా కొనసాగుతున్న చెత్త, ప్లాస్టిక్ డంపింగ్ యార్డ్‌లను వెంటనే తొలగించాలి. జనవాసాల మధ్య ఇలాంటి స్క్రాప్ గోడౌన్‌లలో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. వీటిని చిన్న చిన్న గల్లీలలో ఏర్పాటు చేస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు వీటి వద్దకు ఫైరింజన్లు కూడా వెళ్లే పరిస్థితి ఉండదు. వేసవిలో ప్రమాదాలు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వెంటనే వీటిని మూసి వేయించాలి.

– దూడల శ్రీనివాస్ గౌడ్, జల్‌పల్లి